


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

సోమవారం 11 ఆగస్టు 2025 పేజీలు 8


# కృష్ణమ్మ తీరాన కళా ఝరి..





**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 10, మేజర్ న్యూస్ :** నగర చిన్నారులు, యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసి, గుర్తించి.. భావితరాలకు కళా సంపదను వారసత్వంగా అందించేందుకు విజయవాడ గాట్ టాలెంట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గత ఆదివారం మొదటి కేటగిరీలో ఆరేళ్లలోపు చిన్నారుల నృత్య పోటీలు జరగ్గా.. ఈ ఆదివారం హరిత బెరం పార్కులో రెండో కేటగిరీలో ఏడు నుంచి పదేళ్ల వరకు చిన్నారుల నృత్య ప్రదర్శనలు మిగతా 2లో...



### కూటమి ప్రభుత్వంలో..

## అభివృద్ధి బాటలో గ్రామాలు

**తోట్లవల్లూరు ఆగస్టు 10 మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన తోట్లవల్లూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరితో కలసి పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ప్రారంభించారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులు 35 లక్షల రూపాయలు, పూర్వపు రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రనాథ్ నిధులు 10 లక్షల రూపాయలు, మొత్తం 45 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ సామాజిక భవనాన్ని ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ బాలశౌరి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి

మిగతా 7లో



### సామాజిక, రాజకీయ, ఆర్థిక

## భరోసా టీడీపీయే..

- కల్లుగీత కార్మికులకు మద్యం షాపులు, బార్‌లలో 10 శాతం వాటా కూటమి ఘనత
- త్వరలోనే నీరాపైనా నిర్ణయం తీసుకుని అండగా నిలుస్తాం
- గీత కులాల ఆధ్వర్యంలో కృతజ్ఞతా ర్యాలీలో మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బడుగు బలహీన వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా తోడ్పాటు అందించే ఘనత కూటమి ప్రభుత్వానికి మాత్రమే సాధ్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గీత కులాలకు మద్యం షాపుల్లో 10 శాతం షాపులు కేటాయించడమే కాకుండా లైసెన్సు ఫీజులో కూడా 50 శాతం సబ్సిడీ కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అదే సమయంలో బార్‌లలో కూడా 10 శాతం గీత కులాలకు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు గీత కార్మికుల ఆధ్వర్యంలో నిర్వహించిన కృతజ్ఞతా ర్యాలీలో పాల్గొన్నారు. మచిలీపట్నంలోని బస్టాండ్ వద్ద అన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం బస్టాండ్ సెంటర్ నుండి రుద్రవరం వరకు గీత కార్మికులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. మిగతా 7లో...



### పోస్ట్‌మ్యాన్ వసంతరావు అవినీతి అక్రమాలపై

## విచారణ జరిపించండి

### రాజకీయ నాయకుడిగా చలామణి అవుతూ అక్రమాలకు పాల్పడుతున్న పోస్ట్‌మ్యాన్ వసంతరావు

### ఆయన అవినీతికి సహకరిస్తున్న స్థానిక అధికారులపై చర్యలు శూన్యం

**జగ్గయ్యపేట ఆగస్టు 10 మేజర్ న్యూస్ :** మండలంలోని తిరుమలగిరి గ్రామ పంచాయతీ పరిధిలో పోస్ట్మాన్‌గా పనిచేస్తున్న పోతురాజు వీర వసంతరావుపై అనేక అవి నీతి ఆరోపణలు రోజు రోజుకి 2

# కృష్ణమ్మ తీరాన కళా ఝరి..






(మొదటిపేజీ తరువాయి)

ఉల్లాసంగా జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ విజయవాడ అంటేనే కళలకు నిలయమని.. ఈ కళా సంపద కనుమరుగు కాకుండా ఉండేందుకు, చిన్నారులు, యువతను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేటి ఆధునిక జీవనశైలిలో ఎదురయ్యే ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు, ఆరు రోజుల పాటు అలసిన మనసుల్లో కొత్త ఉత్తేజం నింపేందుకు ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ పోటీలు దోహదం చేస్తున్నాయని.. ఈ చొరవ ముున్ముందు కూడా కొనసాగుతుందని కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు.

**సామాజిక చైతన్యానికీ మార్గం**

కళా ప్రదర్శనలు ద్వారా ప్రజల్లో వివిధ అంశాలపై సామాజిక చైతన్యం తీసుకొచ్చేందుకూ వీలవుతుందని.. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, పర్యావరణహిత మార్గాలు వంటివాటిపై ఈ ప్రదర్శనల ద్వారా అవగాహన పెంపొందిస్తున్నట్లు తెలిపారు. సుసంపన్న, ఆరోగ్య, ఆనంద ఆంధ్ర సాకారానికి పర్యావరణ పరిరక్షణ కీలకమని.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి చెక్ పెట్టి.. స్వచ్ఛతా మార్గంలో ప్రజలు పయనించేలా ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. నవ్య రాజధాని అమరావతికి గేట్‌వే అయిన విజయవాడను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు, రోల్ మోడల్‌గా నిలిపేందుకు జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ.. వివిధ భాగస్వామ్య పక్షాల సహాయంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. పర్యాటకంగా కూడా అభివృద్ధి సాధించేందుకు ఇలాంటి వినూత్నకార్యక్రమాలను కొనసాగించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. వచ్చే ఆదివారం 11-15 ఏళ్ల కేటగిరీలో నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డా. డి.చంద్రశేఖర్, పెద్దసంఖ్యలో చిన్నారులు, తల్లిదండ్రులు, నగర ప్రజలు పాల్గొన్నారు.

**నృత్య పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు**

**ప్రతిభను గుర్తించి.. ప్రోత్సహించేందుకే ఈ వినూత్న చొరవ**

**కళా సంపదను భావితరాలకు వారసత్వంగా అందించే ప్రయత్నం**

**పర్యావరణ హిత జీవనశైలిపైనా అవగాహన పెంపొందించేందుకు మార్గం**

**నగర ప్రజల మానసిక ఉల్లాసానికీ పోటీలు దోహదం**

**ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**









## పోస్ట్‌మ్యాన్ వసంతరావు అవినీతి అక్రమాలపై విచారణ జరిపించండి

(మొదటిపేజీ తరువాయి)



బట్టబయలవుతున్నాయి. ఆయన చేసిన అవినీతి తీగలాగితే డొంక బయటపడ్డట్టుగా ఉంది అనే చందాన ఉంది. పోతురాజు వీర వసంతరావు అనే వ్యక్తి కేంద్ర ప్రభుత్వ శాఖలో పోస్ట్ మాన్ గా పని చేస్తున్నప్పటికీ ఆయన రాజకీయ నాయకుడిగా అందరికీ సుపరిచితుడు. తన ఉద్యోగాన్ని సక్రమంగా నిర్వర్తించకుండా ఆయన స్థానంలో వేరే ప్రైవేటు వ్యక్తి ద్వారా తన విధులను నిర్వర్తించే విధంగా చేసేవాడు. అలాగే పోస్ట్ ఆఫీస్ ను సైతం తన ఇంట్లోనే పెట్టి అద్దె రూపంలో ప్రభుత్వ నిధులను మింగేసేవాడని ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ నాయకులకు అనుకూలంగా ఎటువంటి ప్రచారాలు నిర్వర్తించకూడదనే నిబంధన ఉన్నప్పటికీ ఎన్నికల ఆదేశాలను ఖాతరు చేస్తూ తను స్వయంగానే వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేసి సస్పెండ్ అయినట్టుగా అప్పట్లో పెద్ద దుమారం రేపింది. అయినప్పటికీ ఆయన తీరులో ఎటువంటి మార్పు లేదు. తన రాజకీయ పలుకుబడితో జగ్గయ్యపేట మండలం తొర్రగుంటపాలెం రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్ 2, 49 లో గల సుమారు రెండు కోట్ల రూపాయల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని తన పేరున రికార్డులను తారుమారు చేసినట్లు సమాచారం. తను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు అందించే సంక్షేమ పథకాలను సైతం తన రాజకీయ పలుకుబడితో ప్రభుత్వాన్ని మోసం చేస్తూ తెల్ల రేషన్ కార్డు ద్వారా ఎన్టీఆర్ భరోసా పెన్షన్, ఉపాధి హామీ పథక విధులను దుర్వినియోగం చేస్తూనే అనేక అవినీతి ఆరోపణ పాల్పడుతున్నాడు. అలాగే తన అవినీతికి సహకారం అందిస్తున్న స్థానిక అధికారులపై సమగ్ర విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పోస్ట్మాన్ వీర వసంతరావు తన రాజకీయ పలుకుబడితే అనేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటంతో అతనిపై పోలీస్ స్టేషన్లో క్రిమినల్ కేసులు కూడా ఉన్నాయని సమాచారం. ఈ విధంగా ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి ప్రభుత్వాన్ని మోసం చేస్తూ గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలను ఖాతరు చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న పోతురాజు వీర వసంతరావు పై సమగ్ర విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన జి విజయ రాజు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినట్లు పత్రికా ముఖంగా తెలిపారు.



## మండలి వెంకట కృష్ణారావు చిత్రమాలిక బహుకరణ

**అవనిగడ్డ** : దివిసీమ గాంధీ, ఆర్త జన బంధువు స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకల సందర్భంగా మండలి అభిమానులు కృష్ణారావు అపురూప ఫోటోలతో కూడిన చిత్రమాలికను బహుకరించారు. అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన మండలి కృష్ణారావు శత జయంతి, క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవ వేడుకల వేదికపై మండలి అభిమానులు గాజుల పోతురాజు మిత్రబృందం ఈ అపురూప చిత్రమాలిక ఫోటోను సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, రాష్ట్ర మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు చేతుల మీదుగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ లకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో గాజుల పోతురాజు మిత్రబృందం సింహాద్రి పవన్ (ఎస్పీ), నున్న సుబ్బారావు, చిలక శ్రీనుబాబు (మాజీ ఎంపీటీసీ), గురివిందపల్లి అనీల్, బండే ఫణి పాల్గొన్నారు. గత ఏడాది గాజుల పోతురాజు మిత్రబృందం మూడు తరాల మండలి నాయకత్వం స్పురించేలా మండలి వెంకట కృష్ణారావు, మండలి బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్ ప్రత్యేక ఫోటోను బహుకరించారు.



## గంగానమ్మ తల్లి సంబరాలలో మాజీ ఎమ్మెల్యే కైలే

**తోట్లవల్లూరు ఆగస్టు 10 మేజర్ న్యూస్ :** తోట్లవల్లూరు మండల పరిధిలోని యాకమూరు గ్రామం లో ఆదివారం జరిగిన గంగానమ్మతల్లి సంబరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కుబడి చెల్లించారు. ఈ కార్యక్రమంలో కైలే అనిల్ కుమార్ తో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాయి మందిరంలో ప్రత్యేక పూజలు



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** ఏ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామంలో నూతనంగా నిర్మాణం జరిగిన శివ దత్త సాయి మందిరంలో ఆదివారం తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యులు కొలికిపూడి శ్రీనివాసరావు జన్మదిన సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ నిర్వహకులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించి వారు ఆయురు ఆరోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉన్నత పదవులతో కొనసాగాలని భగవంతుడు నీ ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు గడ్డి కృష్ణారెడ్డి, న్యాయంపల్లి రామకృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షులు ఒంటేరు రామారావు, ఆలయ ధర్మకర్త గుంటక సుదర్శన్ రెడ్డి (అమ్ములు) పాల్గొన్నారు.

## కృష్ణా జలాలు సరఫరా చేయాలి




**ఏ.కొండూరు, మేజర్ న్యూస్ :** ప్రజలు ఇబ్బందులు గురికాకుండా కృష్ణా జలాలు సరఫరా చేయాలని సిపిఎం పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని కేజీ తండాలో ఆదివారం తిరువూరు ఆర్డీవో కే మాధురి కృష్ణా జలాలు సరఫరా, ట్యాంకర్లను పరిశీలించడానికి వచ్చారు. కృష్ణా జలాలు సరఫరా పరిశీలించడానికి వచ్చిన ఆర్డీవో దృష్టికి సిపిఎం నాయకులు పలు సమస్యలు తీసుకెళ్లారు ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పనేం ఆనందరావు ఆళ్ల అన్ని రెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాలపై గిరిజనులు పడుతున్న ఇబ్బందులను ఆమెకు వివరించారు. జల్ జీవన్ ప్రాజెక్టు ద్వారా నిర్మాణం జరుగుతున్న కృష్ణా జలాల పైపులైన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అలానే మండలంలో కిడ్నీ రేహాబిలేషన్ ప్రాంతాలు అయిన 20 గ్రామాల్లో డి ఎం ఎఫ్ టి నిధుల ద్వారా నిర్మించిన 50 సింటెక్స్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. వీటిని పరిశుభ్రపరిచే పనిని తక్షణమే గ్రామ పంచాయతీలకు అప్పచెప్పాలని వారు ఈ సందర్భంగా ఆమెకు తెలియజేశారు. సింటెక్స్ ట్యాంకులు శుభ్రపరచకపోవడం వల్ల అందులో ఉన్న నీరు పచ్చ రంగుకు మారడంతో గిరిజనులు ఆ నీళ్లను త్రాగలేకపోతున్నారని అన్నారు. కొన్ని గ్రామాల్లో పగిలిపోయిన సింటెక్స్ ట్యాంకులు దర్శనమిస్తున్నాయని వాటిని మరమ్మత్తులు చేయించాలని అలానే పైపులైన్ ద్వారా నీరు సరఫరా అయ్యేవరకు కృష్ణా జలాలను ట్రాక్టర్ల ద్వారా తరలించే విషయంలో జాప్యం జరగకుండా చూడాలని ఆర్డిఓ దృష్టికి సిపిఎం మండల కమిటీ తీసుకువెళ్లారు.

## బూతిమిల్లిపాడు శ్రీ కోదండరామాలయం పునర్నిర్మాణ శంఖుస్థాపన



**గన్నవరం, ఆగస్టు 10, మేజర్ న్యూస్ :** గన్నవరం మండలం బూతిమిల్లిపాడు గ్రామంలోని శ్రీ కోదండరామాలయం దాతల సహకారంతో పునఃర్నిర్మాణం జరుగుతోంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 11 గంటల 34 నిమిషాలకు శంఖుస్థాపన కార్యక్రమం ఆలయ కమిటీ, గ్రామస్థుల ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీరామ నామజపంతో వాతావరణాన్ని భక్తిమయంగా మార్చారు. శంఖుస్థాపన వేడుక విజయవంతంగా ముగిసింది.

# మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



### నగర పరిసర ప్రాంతాల్లో 650 పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన మైత్రీ ఫౌండేషన్

### ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రక్తదానమే మహాదానమని, రక్తదాతల సేవలు వెలకట్టలేనివని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత అన్నారు.గత మూడు సంవత్సరాలుగా నగర పరిసర ప్రాంతాల్లో 650 పైగా"సేవా కార్యక్రమాలు "నిర్వహించిన మైత్రీ ఫౌండేషన్ వారు ఆదివారం రక్తదానం మహాదానం' అనే కార్యక్రమం క్రింద "మెగా రక్తదాన శిబిరం" బెల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆఫీస్‌లో నిర్వహించారు. సభకు మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు కాసాని వేణు కుమార్ అధ్యక్షత వహించారు. మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి రక్తనిధి సిబ్బంది "సహకారంతో ఆదివారం దాదాపు 50 మంది రక్తదాతల నుండి రక్తం స్వీకరించి సర్వజన ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు వారికి మైత్రి ఫౌండేషన్ వారు అందించారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఆశాలత మాట్లాడుతూ అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అని, ప్రాణావసరం ఉన్న వారికి రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందని, వారి ప్రాణాలను నిలబెట్టే రక్తం,అపర సంజీవని అని అన్నారు. రక్తదానం చేసే దాతల్ని ఈ సందర్భంగా ఆశాలత అభినందించారు. రక్తదాన ఆవశ్యకతను, రక్తదాతలు అందించే రక్తాన్ని వివిధ పద్ధతుల్లో ఏ విధంగా విడగొట్టడం జరుగుతుందో, రోగులకు వైద్యం అందించే సమయంలో రక్తదాతలు అందించిన రక్తం ఎలా ఉపయోగించడం జరుగుతుందో సవివరంగా, సమగ్రంగా డాక్టర్ ఆశాలత వివరించారు.గౌరవ అతిథి లంకిశెట్టిబాలాజీ మాట్లాడుతూ 'మైత్రి ఫౌండేషన్' చేస్తున్న సేవల్ని ప్రశంసిస్తూ ఫౌండేషన్ సభ్యులకు అభినందనలు తెలియజేసారు. బాలాజీ ఇదే శిబిరంలో స్వచ్ఛందంగా రక్తదానం చేయడం విశేషం. బ్లడ్ క్యాంపులో ఉపాధ్యక్షుడు కాసాని ప్రసాద్ గ్రామమైన పిళ్ళారి శెట్టిపాలెంకి చెందిన 24 మంది యువకులు స్వచ్ఛంద రక్తదానం చేసి తమ ఉదారతను చాటుకున్నారు. మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు కాసాని వేణు కుమార్ మాట్లాడుతూ బాల బాలికలకు ప్రాథమిక దశ నుండే రక్తదానంపై పరిపూర్ణ అవగాహన కల్పించవలసిన గురుతర బాధ్యత, తల్లిదండ్రులది ఉపాధ్యాయులది అన్నారు. ప్రాణాన్ని నిలబెట్టే రక్తం అందక ఏ పేషంట్ ఇబ్బంది పడకూడదన్నారు. నేటి శిబిరంలో స్వచ్ఛందంగా రక్తదానం చేసిన దాతల సేవలు వెలకట్టలేనివన్నారు. గౌరవ అధ్యక్షులు వరప్రసాద్, ఉపాధ్యక్షులు కాసాని ప్రసాద్,దీప్తి, బ్లడ్ కమిటీ చైర్మన్ రమాదేవి, బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జ్ డాక్టర్ పావని, ఫుడ్ కమిటీ చైర్మన్ అనిల్, సభ్యులు రామకృష్ణ, నిరంజన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే యార్లగడ్డ చొరవతో వాగు పుడికతీత పనులు ప్రారంభం



**గన్నవరం, ఆగస్టు 10, మేజర్ న్యూస్ :** గత కొన్ని దశాబ్దాలుగా రైతులను ఇబ్బంది పెడుతున్న సమస్య గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతో రోజుల్లోనే పరిష్కారమయ్యింది. గన్నవరం మండలం, ముస్తాబాద గ్రామ శివారు ప్రాంతంలోని బుడమేరు డ్రైన్, అక్కిలేరు వాగు వద్ద గత 30 సంవత్సరాలుగా పూడిక తీయకపోవటంతో బుడమేరు వాగు ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. భారీ వర్షాలు కురిసినప్పుడు వరదనీటితో పొలాలు ముంపుకు గురై రైతులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముస్తాబాద గ్రామ టిడిపి నాయకులు, స్థానిక రైతులు, నీటి సంఘాల అధ్యక్షులు ఈ సమస్యను ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావుకు తెలియజేయగా, వెంటనే స్పందించి రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుతో చర్చించి సమస్య పరిష్కరానికి కృషి చేశారు. ఈమెరకు ఆదివారం ఉదయం అక్కిలేరు వాగు వద్ద పూడికతీత పనులు ప్రారంభించారు. సమస్య తెలిపిన వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టిన శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు కు ముస్తాబాద గ్రామ రైతులు కృతజ్ఞతలు తెలిపారు. గన్నవరం ఏఎంసి డైరెక్టర్ పాలడుగు మల్లికార్జున రావు, ముస్తాబాద గ్రామ టిడిపి అధ్యక్షులు కడియాల రాజశేఖర్, నీటి సంఘాల అధ్యక్షులు కొమ్మినేని చంద్రశేఖర్ స్థానిక రైతులు పూడికతీత పనులను పర్యవేక్షించారు.

# గీత కార్మికుల ఆర్ధికాభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి



### గీత కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం

### ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వర్ల

**తోట్లవల్లూరు ఆగస్టు 10 మేజర్ న్యూస్ :** గీత కార్మికుల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బీసీలపై ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి ఆధ్వర్యంలో మండల కేంద్రమైన తోటవల్లూరులో గీత కార్మికుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్నవారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి గీత కార్మికులకు ప్రత్యేక సదుపాయాలను కల్పిస్తోందన్నారు. గతంలో ఆదరణ పథకం కింద గీత పనిముట్లు అందించడంతోపాటు సైకిళ్ళను పంపిణీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. అలాగే మొన్న జరిగిన మద్యం దుకాణాల కేటాయింపులలో కూడా గీత కార్మికులకు పది శాతం కేటాయించారని, ప్రస్తుతం బార్ లైసెన్స్ లలో కూడా గీత కార్మికులకు 10 శాతం కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. గత ప్రభుత్వంలో గీత వృత్తిని పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. ప్రభుత్వమే మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి అందులో కల్తీ మద్యం విక్రయించడం ద్వారా గీత కార్మికుల పొట్ట కొట్టారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించాక బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో తొలిసారిగా 20 శాతం రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. అనంతరం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక దానిని 33 శాతానికి తెచ్చారని పేర్కొన్నారు. బీసీలకు పూర్తిస్థాయిలో అండగా ఉండేది తెలుగుదేశం ప్రభుత్వమేనని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. గీత కార్మికులకు 50 సంవత్సరాలకే పింఛన్ పథకాన్ని అమలు చేస్తున్న ఘనత కూడా తమ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేనపార్టీ పామర్రు నియోజకవర్గ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరపనేని శివరాం తదితరులు పాల్గొన్నారు. తొలుత గీత కార్మికులు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు బాలశౌరి, కుమార్ రాజా, గురుమూర్తి తదితరులు పాలాభిషేకం చేశారు.



# ఏఎంసి డైరెక్టర్ బాబురావుకు అభినందన



**గన్నవరం (హనుమాన్ జంక్షన్), ఆగస్టు 10, మేజర్ న్యూస్ :** గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులుగా నియమితులైన ముస్నంగి శేషగిరిరావు ( బాబురావు)ను పలువురు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు అభినందించారు. కాకులపాడు ఛానల్ డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ నేతృత్వంలో ఆదివారం ఉదయం పెరికిడులోని రైస్ మిల్ లో జరిగిన కార్యక్రమంలో బాబూరావు కు శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించి అభినందించారు. అనంతరం కేకు కోసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ గన్నవరం మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మరింత సేవ చేయాలని సూచించారు. గ్రామాల్లోని డొంక రోడ్లను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని బాబురావు కోరారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు డైరెక్టర్గా అవకాశం కల్పించిన గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలిపారు. యార్లగడ్డ ఆశయాల మేరకు పనిచేసి మార్కెట్ యార్డ్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా బాబురావు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో దంటగుంట్ల సర్పంచ్ యజ్జవరపు రంగారావు, కాకులపాడు కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ యజ్జవరపు శ్రీనివాసరావు, కానుమోలు కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ దన్నె దుర్గారావు, కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు వేగిరెడ్డి పాపారావు, టీడీపీ నాయకులు జాస్తి భూపతి, సూర్యప్రకాష్, కాకులపాడు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెన్నుబోయిన బీరయ్య, రంగయ్య అప్పారావుపేట తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ధోనె రాము, కాకులపాడు ఛానల్ నీటి సంఘం ఉపాధ్యక్షులు అట్లూరి సత్తిబాబు, లింగం పిచ్చేశ్వరరావు, కొత్తూరు ఆంజనేయులు, కాళీ రమేష్, పొట్లూరి జగన్, చీకటి రాము తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్ట్ నాయకులు అట్లూరి రాజశేఖర్, నల్లగంచు రామకృష్ణ, పరుచూరి రామకృష్ణ బాబురావుకు పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు.

# రాహుల్ ప్రశ్నలకు ఈసీఐ సమాధానం చెప్పాల్సిందే..



**విజయవాడ మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ సహా కర్ణాటక, మహారాష్ట్ర, హర్యానా, ఇతర ప్రాంతాల్లో ఓటర్ల జాబితాలో పెద్ద ఎత్తున వ్యత్యాసాలకు సంబంధించి లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ లేవనెత్తిన ఐదు ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని సీడబ్ల్యూసీ మెంబర్, ఏపీసీసీ పూర్వ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు భారత ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఆరు నెలలుగా రాహుల్ గాంధీ నిరంతర దర్యాప్తులో భాగంగా దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా భారతీయ జనతా పార్టీకి ప్రయోజనం చేకూర్చేలా ఈసీఐ అనుమానాస్పద విధానాన్ని, దాని నిర్ణయాలను బహిర్గతం చేశారన్నారు. ఎన్నికల్లో బీజేపీ దాని కూటమి భాగస్వాములకు ప్రయోజనం చేకూర్చేలా దుష్ప్రవర్తనలను ప్రోత్సహిస్తున్నందున ఈసీఐ డిజిటల్ ఫార్మాట్‌లో ఎన్నికల డేటాను అందించడం లేదన్నారు. “2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడి 48 లోక్‌సభ స్థానాల్లో 31 స్థానాలను గెలుచుకుంది. కానీ నాలుగు నెలల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అనుమానాస్పదంగా ఓడిపోయింది. “ఓటర్లు తక్కువ సమయంలో తమ అభిప్రాయాన్ని మార్చుకోరు, ఇది ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అనేక సందేహాలను లేవనెత్తుతుంది,” అని రుద్రరాజు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగినప్పటికీ, రాబోయే బీహార్ ఎన్నికల్లో బిజెపి భారీ ఓటమిని చవిచూస్తుందన్నారు. ఎన్నికల వ్యవస్థపై రాహుల్ గాంధీ చేసిన అవిశ్రాంత పోరాటం సాధారణ ప్రజల దృష్టిని ఆకర్షించిందని తెలిపారు. గత 11ఏళ్ళల్లో వైయస్సార్సీపీ, టీడీపీ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ యొక్క పేలవమైన పరిపాలనతో ప్రజలు విసిగిపోయారని పేర్కొంటూ కాంగ్రెస్ అతి త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతుందని రుద్రరాజు ధీమా వ్యక్తం చేశారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఆంధ్రప్రదేశ్‌పై ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రతి స్థాయిలో పార్టీని పునరుద్ధరించడానికి కొత్త రాజకీయ వ్యవహారాల కమిటీని నియమించిందని చెప్పారు. అంతర్గత ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ యొక్క ప్రాముఖ్యతను విస్మరించిన ప్రాంతీయ పార్టీల పనితీరు పట్ల కాంగ్రెస్ పార్టీని విడిచిపెట్టిన చాలామంది నాయకులు తిరిగి పార్టీలోకి వస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# శ్రీ కొండలమ్మ గుడికి విశేష సంఖ్యలో భక్తులు





**అంగలూరు నివాసి కొలుసు నాగేశ్వరరావు వెండి కిరీటం బహుకరణ**

**ఆగస్టు15న శ్రావణ మాస సామూహిక వరలక్ష్మి వ్రతములు**

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో శ్రావణ మాసం ఆదివారం అగుట వలన భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తరించారు. శ్రీ అమ్మవారిని సుమారు 20,000 మంది పైగా భక్తులు దర్శించుకొనినారు. అత్యధిక స్థాయిలో భక్తులు శ్రీ అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి యొక్క మొక్కుబడులు తీర్చుకొన్నారు. శ్రీ అమ్మవారి దేవస్థానమునకు విచ్చేసిన భక్తులకు త్రాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు, ఏ విధమైన అసౌకర్యములు కలగకుం డా దర్శనం చేసుకొనుటకు దేవస్థాన కార్యనిర్వ హణాధికారి ఆకుల కొండలరావు పర్యవేక్షిం చినారు. శ్రీ అమ్మవారిని ధర్శించుకొనుటకు విచ్చేసిన భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేయటమైనది.

**72వేలతో వెండి కిరీటం బహుకరణ :** అంగలూరు గ్రామం వాస్తవ్యులు కొలుసు నాగేశ్వరరావు శ్రీ కొండలమ్మ అమ్మవారి ఉత్సవ మూర్తికి వెండి 371 గ్రాములు, స్టోన్స్ 60 గ్రాములు షుమారు రూ.72,000లు విలువ గల వెండి కిరీటము బహుకరించినారు. వారికి ఆలయ మర్యాదలతో సత్కరించారు. శ్రీ కొండలమ్మ అమ్మవారి దర్శన మునకు విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అసౌకర్యములు, అవాంఛనీయ, సంఘటనలు కలగకుండా గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ, వారి సిబ్బంది తగు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

**3 వ శుక్రవారము (దీ.15-08-2025)**

**సామూహిక వరలక్ష్మి వ్రతములు:**

ది.15.08.2025 శ్రావణ మాసం 3వ శుక్రవారం సందర్భముగా శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో మహిళామణులచే సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరుగును. వ్రతములో పాల్గొను మహిళా భక్తులు ముందుగా 516 రూపాయలు చెల్లించి రశీదు తీసుకుని పేరు నమోదు చేసుకోవాలని కోరుతున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపినారు.



# ప్రతిభావంతులకు మానవత గన్నవరం శాఖ వారి ఆర్థిక సహాయం



**గన్నవరం, ఆగస్టు 10, మేజర్ న్యూస్ :** ఆదివారం ఉదయం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి (మార్చ్ 2025)కృష్ణా జిల్లా లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థి దుబ్బాకు దుర్గా యశ్వంత్ కు (591) రు. 3000/-ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థి దుబ్బాకు వీర వెంకట నాగేంద్ర కు (589)రు. 2000/- ప్రోత్సాహక బహుమతి అందించి, అభినందించి, వారి తల్లిదండ్రులను సన్మానించడం అయినది. అప్పటి ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ టి. సీతారాం ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండల విద్యాశాఖ అధికారి జె సాంబశివరావు, మానవతా చైర్మన్ మడుపల్లి బాలకృష్ణమూర్తి, కో చైర్మన్ కె ఎస్ జగదీశ్వరరావు, కన్వీనర్ కరా వరప్రసాద్, అధ్యక్షుడు వీసం ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు పువ్వల ఆదినారాయణ, కార్యదర్శి వి వి కృష్ణమోహన్, సహాయ కార్యదర్శి వడ్లమూడి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ ఉడత రామకృష్ణ పాల్గొన్నారు.



## ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం..

# ప్రజలకు శాపం

**వత్సవాయి, ఆగస్టు 10, మేజర్ న్యూస్ :** సిపిఎం మండల కార్యదర్శి బి.రాము మాట్లాడుతూ సాగర్ కాలువకు నీరు వచ్చిన ప్రతి సారి రహదారిపై నీరు ఉండడంతో మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్, మండల వ్యవసాయ అధికారి కార్యాలయం, రైతు సేవా కేంద్రం, గ్రామ సచివాలయంకు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారని అయినా ధైర్యం చేసుకొని ప్రజల నీటిలో వెళ్తుంటే పాములు, తేళ్లు విషపూరితమైనవి మొదలగునవి ఉన్నాయని కాలువ ఆక్రమణకు గురైందని ఈ ఆక్రమణల వలనే కాలువ కుదించుకుపోయిందని, పూడిక తీత లేకపోవడం వలన పనులు, మొదలు పెట్టాలని లేదంటే ప్రజలను కలుపుకుని ఆందోళన చేస్తామని తెలియజేశారు.

## మిసెస్ ఇండియా విజేత విజయలక్ష్మికి ఘన స్వాగతం



**గన్నవరం, ఆగస్టు 10, మేజర్ న్యూస్ :** హైదరాబాద్ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న మిసెస్ ఇండియా 2025 విజేత కవ్వం విజయలక్ష్మికి ఘన స్వాగతం లభించింది. గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు, పిఆర్కే ఫౌండేషన్ అధినేత పారా రామకృష్ణతో పాటు పలువురు ప్రముఖులు విజయలక్ష్మిని శాలువాతో సన్మానించారు. తరువాత విజయలక్ష్మి రోడ్డుమార్గం ద్వారా విజయవాడ బయలుదేరారు.

## గుత్తికొండ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** గుత్తికొండ చారిటబుల్ ట్రస్ట్ అధినేతలు గుత్తికొండ కళ్యాణ్ రవి చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (కెడిసిసి బ్యాంక్) చైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. ఆదివారం ఘంటసాల మండలం తెలుగురావుపాలెంలో ట్రస్ట్ అధినేత గుత్తికొండ కళ్యాణ్ కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిసి వారు గత 16 సంవత్సరముల నుంచి ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవలను ప్రశంసించారు. అనంతరం కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాంను పలువురు గ్రామ ప్రముఖులు, గ్రామస్తులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు గుత్తికొండ సీతారామయ్య, గుత్తికొండ హేమ కుమార్, పర్వత నేని ప్రసాద్, పర్వతనేని లవకుశ, మాజీ సర్పంచ్ అరుంభాక రవి, తదితరులు పాల్గొన్నారు.

## స్వామి గోపాలరావు దంపతులకు ఘన సన్మానం



**పెనుగంచిప్రోలు, ఆగస్టు 10, మేజర్ న్యూస్:** పెనుగంచిప్రోలు గ్రామంలో శ్రీ లక్ష్మి తిరుపతమ్మ తల్లి గోపయ్య స్వామి వారి సన్నిధి ఆలయం సమీపంలో ఆర్య వైశ్య అన్నదాన సత్రం నూతన నిర్మాణ బిల్డింగ్ ప్రారంభోత్సవంలో స్వామి గోపాల్ రావు వారి దంపతులను సన్మానిస్తున్న ఆర్యవైశ్య పెద్దలు, ప్రముఖులు. మీరు పెనుగంచిప్రోలు పట్టణమే కాకుండా మండల పరిధిలోని అనేకమందికి సుపరిచితులు వైద్యంలోనూ విద్యాలయాలు దేవాలయాల్లోనూ వీరి దాతృత్వం చాలా గొప్పది. ఈరోజు ఆర్యవైశ్య నూతన అన్నదాన మండపాన్ని నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభించిన సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనను ఘనంగా సన్మానించారు.

# బీసీల అభ్యున్నతే సీఎం చంద్రబాబు ఎజెండా



## 10శాతం మద్యం దుకాణాలు,బార్ల లైసెన్సులు గీత కార్మికులకు కేటాయించడంపై హర్షం

## సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేసిన కల్లుగీత కార్మికులు, బీసీ సంఘాల నేతలు

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ ఆగస్టు 10:** రాష్ట్రంలో బీసీ వర్గాల అభ్యున్నతే ఎజెండాగా సీఎం చంద్రబాబు అనేక చర్యలు తీసుకుంటున్నారని గుడివాడ నియోజకవర్గ టిడిపి నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10శాతం మద్యం దుకాణాలు, బార్ల లైసెన్సులను గీత కార్మికులకు కేటాయించడం పట్ల టిడిపి నాయకులు, బీసీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన గుడ్లవల్లేరు గ్రామంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి గీత కార్మికులు, గౌడ సంఘ, బీసీ సంఘాల నాయకులు క్షీరాభిషేకాలు చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాములకు నాయకులు జేజేలు పలికారు. నాడు ఎన్టీఆర్, నేడు సిఎం చంద్రబాబు బీసీ వర్గాల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారని నాయకులు కొనియాడారు.బీసీలకు తెలుగుదేశం పార్టీ ఎల్లపుడూ అండగా నిలుస్తుందని, పార్టీకి బీసీలు వెన్నెముక అని అన్నారు. టిడిపి అధికారంలో ఉన్నంతకాలం కులవృత్తులు చేసుకునే బీసీ వర్గాలను ప్రోత్సహించేలా అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీలను అన్నివిధాలుగా మోసగించి వారి అభివృద్ధిని మరింత కుంటుపడేలా చేసిందని, వారి అభివృద్ధికి కేటాయించాల్సిన నిధులను పక్కదారి పట్టించడంతో పాటుగా వారిపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తీసుకున్న చర్యలు శూన్యమని నాయకులు విమర్శించారు. అప్పులభారంతో అభివృద్ధి కుంటుపడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరిగి అభివృద్ధి దిశగా ముందుకెళ్లాలంటే చంద్రబాబు నాయకత్వంలో సుస్థిర ప్రభుత్వంతోనే సాధ్యమని నేతలు పేర్కొన్నారు. బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం చంద్రబాబుకు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాములకు బీసీ సంఘాల నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి అబ్జర్వర్ నూకాలమ్మ, సీనియర్ టిడిపి నాయకులు జంగం మోహన్రావు, అడుసుమిల్లి రామ్మోహనరావు, పోలవరపు వెంకట్రావు, కొడాలి రామరాజు, తూము పద్మజ, శాయన ప్రసాద్, చాపరాల రాజా, బీసీ సంఘాల నాయకులు ఈడే మోహన్, పామర్తి సత్తిబాబు, కాగిత నరేంద్ర, శివకుమార్, చిట్టిబొమ్మ నరసింహారావు, బొర్రా ప్రసాద్, బొర్రా మధు, సత్యనారాయణ, మన్యం నాగేంద్రరావు, కన్నె భాస్కరరావు, కల్లుగీత కార్మికులు పాల్గొన్నారు.





## నందిగామలో అన్నదాత సుఖీభవ అమలు చేసినందుకు భారీ ట్రాక్టర్ ర్యాలీ





**నందిగామ, ఆగస్టు 10 మేజర్ న్యూస్:** కూటమి నేతలతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా నందిగామ పట్టణంలో పురవీధుల్లో ట్రాక్టర్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ సాయి అయ్యప్ప దేవాలయం వద్ద ర్యాలీని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య లాంచనంగా ప్రారంభించారు. ప్రధాన రహదారులు మీదుగా ట్రాక్టర్ ర్యాలీ రైతన్నల హర్షద్వానాలతో పండుగ వాతావరణంలో కొనసాగింది. పెద్ద ఎత్తున రైతులు తమ ట్రాక్టర్లతో ర్యాలీలో కదం తొక్కి ఉత్సాహంగా ముందుకు సాగారు. ఈ సందర్భంగా గాంధీ సెంటర్లో సౌమ్య గారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు అన్నదాతలకు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేశారని చెప్పారు. దీనిలో తొలి విడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 5000, పిఎం కిసాన్ పథకంలో కేంద్ర ప్రభుత్వం రూ. 2000 జమ చేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అన్నదాతలకు ఎప్పుడు అండగా ఉంటుందని చెప్పారు. నందిగామలో గత వైయస్సార్సీపీ పాలనలో గత పాలకులు విగ్రహా రాజకీయాలు చేశారని ఆరోపించారు. ఆనాడు ఏకపక్షంగా జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులు విగ్రహాలను తొలగించారని తెలిపారు. కేవలం రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని మాత్రమే అందరికి కనిపించేలాగా పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రాగానే అన్ని విగ్రహాలకు సమన్యాయం చేస్తునామని హామీ ఇచ్చామని చెప్పారు. ఈ మేరకు నందిగామలో గాంధీ సెంటర్లో రోడ్డుపై ట్రాఫిక్ అడ్డంగా పెట్టిన రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని మున్సిపల్ అధికారులు తొలగించారని వివరించారు. దీనిలో ఎటువంటి రాజకీయాలకు తావు లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు,కూటమి నాయకులు, పాల్గొన్నారు.



## సనాతన ధర్మమే అన్ని మతాలకు మూలం

### ఎన్నారై మూల్పూరి వెంకట్రావు

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** సనాతన ధర్మమే అన్ని మతాలకు మూలమని ఎన్నారై మూల్పూరి వెంకటరావు మండల పరిధిలోని తాడేపల్లి గ్రామంలో ఉన్న మలయాళ స్వామి పెద్ద ఆశ్రమంలో వేద పాఠశాల ప్రారంభం లో ఆయన పేర్కొన్నారు. సనాతన ధర్మం లేకుండా మిగతావి లేవని, మానవుడు పుట్టిన తర్వాత సనాతన ధర్మంమే అన్నారు. వేద పరిజ్ఞానాన్ని ఈ ప్రాంతంలో విస్తృత చేయాలని పేర్కొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ జన్మదిన వేడుకలు



**నందిగామ, ఆగస్టు 10, మేజర్ న్యూస్:** భారతీయ జనతా పార్టీ కార్యాలయం లో రాష్ట్ర అధ్యక్షులు ఏబీఎన్ మాధవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమం అనంతరం సీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ తోర్లకొండ సీతారామయ్య. పట్టణ అధ్యక్షులు మునగంటి కామేశ్వరరావు. కొకన్వీనర్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు పులిపాటి లక్ష్మణరావు బండారు కేదార్నాథ్ శర్మ. రాఘవ నరసింహారావు వేణు సతీష్ శ్రీనివాస్ రావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

## గోమాతకు అంతిమయాత్ర, కన్నీటి వీడ్కోలు



**చల్లపల్లి, మేజర్ న్యూస్:** హిందూ ధర్మంలో గోమాతకు ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. సర్వదేవతామూర్తిగా గోమాతను భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. జీవించి ఉండగా పూజించటం కాకుండా మరణించిన తర్వాత సైతం భక్తిశ్రద్ధలతో అంతిమ సంస్కారాలు చేసిన సంఘటన ఇది. చల్లపల్లి గ్రామానికి చెందిన వేముల శ్రీనివాసరావు, వేముల హరికృష్ణలు 20 సంవత్సరాలుగా ఆవును పెంచుకుంటున్నారు. ఆదివారం ఆవు కన్నుమూయటంతో రెండు దశాబ్దాలుగా పెంచుకున్న ఆవుకు ఘనమైన వీడ్కోలు పలికారు. పసుపు, కుంకుమ, చీర సమర్పించి ట్రాక్టర్పై ఉంచి మేళతాళాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ పసుపు, కుంకుమలు, పూలు చల్లుతూ బాణాసంచా మోగిస్తూ ఊరేగింపు చేశారు. కన్నీటి వీడ్కోలు నడుమ నడకుదురు కృష్ణానది రేవులో ఖననం చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు. ఊరేగింపు నిర్వహిస్తున్న సమయంలో ఇళ్లలోంచి మహిళలు వచ్చి భక్తిశ్రద్ధలతో ఆవుపై పసుపు కుంకుమలు, పుష్పాలు చల్లారు.

## చల్లపల్లి మండలంలో సొసైటీ ఛైర్పర్సన్లు

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలంలో సొసైటీ ఛైర్పర్సన్, పర్సన్ల నియామకాలపై ఉత్తర్వులు వెలువడ్డాయి. మాజీ ఎంపీపీ యార్లగడ్డ లంకబాబు లక్ష్మీపురం సొసైటీ ఛైర్పర్సన్గా నియమితులయ్యారు. పర్సన్లుగా తోట రాజేశ్వరరావు, సూదాని పూర్ణచంద్రరావులు నియమితులయ్యారు. చల్లపల్లి సొసైటీ ఛైర్పర్సన్గా బొందలపాటి వీరబాబు, పర్సన్లుగా ఆలూరి విశ్రాంతమ్మ, వేముల హరికృష్ణ, మేకావారిపాలెం సొసైటీ ఛైర్పర్సన్ గా గుత్తికొండ వంశీకృష్ణ. పర్సన్లుగా చిటికినేని శ్రీనివాసరావు, వక్కలగడ్డ శివరామకృష్ణ, వక్కలగడ్డ సొసైటీ ఛైర్పర్సన్గా మల్లుపెద్ది దుర్గామహేష్(నాని), పర్సన్లుగా బట్టు ప్రసాదరావు, మట్టా రమేష్, పురిటిగడ్డ సొసైటీ ఛైరపర్సన్ పెద్దిబోయిన హరనాథ్, పర్సన్లుగా బొల్లా జగన్మోహనరావు, యార్లగడ్డ రమేష్ బాబు, మాజేరు సొసైటీ ఛైర్పర్సన్గా తిరుమలశెట్టి బాలనాగేశ్వరరావు, పర్సన్లుగా తిరుమలశెట్టి నాగరాజశేఖర్, యార్లగడ్డ శ్రీరామచంద్రమూర్తి, మం గళాపురం సొసైటీ ఛైర్పర్సన్గా పరుచూరి వెంకటేశ్వరరావు, పర్సన్లుగా గొరిపర్తి వెంకటేశ్వరరావు, నిడమానూరి జగన్మోహనరావులు నియమితులయ్యారు. వంశీకృష్ణకు అభినందనలు మేకావారిపాలెం సొసైటీ ఛైర్పర్సన్గా నియమితులైన గుత్తికొండ వంశీకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకుడు యార్లగడ్డ శ్రీనివాసరావులను డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావు, విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామరాజు, బుల్లా కిషోర్ లు సన్మానించి అభినందనలు తెలిపారు.

# కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి బాటలో గ్రామాలు





(మొదటిపేజీ తరువాయి)

పవన్ కళ్యాణ్ ల సారధ్యంలో గ్రామాల్లో ఇప్పటికే సిసి రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామన్నారు. ప్రజా సామాజిక అవసరాలలో భాగంగా సామాజిక భవనాలను కూడా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నామని, దీనిలో భాగంగానే తోట్లవల్లూరు శివారు కళాసమాల్లపల్లి, తోట్లవల్లూరు గ్రామాలలో ఈ భవనాలను నిర్మించి పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం వీటిని ప్రారంభించుకోవడం తనకు ఎంతో ఆనందకరంగా ఉందని పేర్కొన్నారు. రానున్న కాలంలో అన్ని గ్రామాలు పూర్తిస్థాయిలో సిసి రోడ్లు, పక్కా డ్రైన్ ల నిర్మాణంతో పాటు ఇంటింటికి కుళాయి కనెక్షన్ అందించి తాగునీటి అవసరాలను కూడా తీరుస్తామని ఆయన పేర్కొన్నారు. అలాగే విజయవాడ యనమలకుదురు నుండి పులిగడ్డ వరకు కృష్ణా నది కరకట్ట రోడ్డు అభివృద్ధికి 150 కోట్ల రూపాయల అంచనాలతో ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఈ కరకట్ట రోడ్డును రెండు అడుగులు ఎత్తు మెరక చేసి రోడ్డును నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని త్వరలో ఈ పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. పాములలంక వంతెన నిర్మాణానికి, మరో ఎనిమిది గ్రామాలకు లింక్ రోడ్లను నిర్మించేందుకు నా బార్డు ద్వారా నిధుల మంజూరుకు కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి ప్రకటించారు. ఈ సందర్భంగా సిఎస్ఆర్ నిధులు మూడు కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటుచేసిన మొబైల్ క్యాన్సర్ డయాగ్నస్టిక్ యూనిట్ ను ఎంపీ బాలశౌరి లాంఛనంగా ప్రారంభించారు. ఈ మొబైల్ క్యాన్సర్ యూనిట్ ద్వారా గ్రామాలలో 35 సంవత్సరాలు పై బడిన మహిళలు ఉచితంగా క్యాన్సర్ కు



సంబంధించిన పరీక్షలు చేయించుకునే అవకాశం ఉందన్నార. ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటుచేసిన ఈ క్యాన్సర్ యూనిట్ ద్వారా ప్రాథమిక దశలోనే గ్రామీణ ప్రాంత ప్రజలకు క్యాన్సర్ ను గుర్తించే అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ అభివృద్ధి పనులకు ఎంతో సహకారం అందిస్తూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను మంజూరు చేయిస్తున్న ఎంపీ బాలశౌరి మనకు ఎంపీగా ఉండటం ఎంతో అదృష్టమని పేర్కొన్నారు. ఇటువంటి ప్రజా సేవకుడైన ఎంపీ బాలశౌరి ద్వారా నియోజకవర్గంలో రానున్న కాలంలో మరిన్ని అభివృద్ధి పనులను శరవేగంతో పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో పలు గ్రామాల్లో సామాజిక భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంతోపాటు పలు గ్రామాల్లో అంతర్గత రోడ్ల అభివృద్ధికి, అలాగే రాష్ట్ర రహదారుల అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయించడంలో ఎంపీ బాలశౌరి చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా అభినందించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, గ్రామ సర్పంచ్ పెనుమత్స రాధిక, పంచాయతీరాజ్ డిఇఇ సురేష్, స్థానిక ఏఈ శరాబంధిరాజు, ఎండిఓ రవికాంత్, జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరపనేని శివరాం ప్రసాద్, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ఎస్.కృష్ణ సుమన్, తెలుగుదేశం పార్టీ నాయకులు రామినేని వెంకట బసవ కుటుంబరావు, నెక్కలపూడి మురళి, వల్లూరు రాంబాబు, తదితరులతోపాటు పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు. తొలుత ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామంలోని బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



## సామాజిక, రాజకీయ, ఆర్థిక భరోసా టీడీపీయే..

(మొదటిపేజీ తరువాయి)

రుద్రవరంలో తాటి చెట్లకు గీత కార్మికులు పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి సంఘీభావంగా.. ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కార్మికులు పేర్కొన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ,తెలుగుదేశం పార్టీతోనే బీసీల జీవితాల్లో వెలుగులు సాకారమయ్యాయన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా బీసీలు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి వెన్నంటి నిలిచారు. వారిని అన్ని రకాలుగా ఆదుకునేందుకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. ఎన్నికల హామీ మేరకు మద్యం షాపుల్లో 10 శాతం షాపుల్ని లైసెన్సు ఫీజులో 50శాతం రాయితీతో కేటాయించడం సాహసోపేతమైన నిర్ణయం అన్నారు. ఈ నిర్ణయంతో రూ.110 కోట్ల వరకు గీత కులాల వారికి మేలు చేశామన్నారు. త్వరలోనే ప్రకటించనున్న బార్ పాలసీలో కూడా గీత కులాల వారికి 10 శాతం బార్లను కేటాయించామని తెలిపారు. గతంలో చెట్టుపై నుండి పడి చనిపోయిన వారికి జీవిత బీమా, గాయాలపాలైన వారికి ఆర్థిక సాయం, దివ్యాంగులైన వారికి పెన్షన్ సదుపాయం కల్పించాం. కల్లుగీత వృత్తిని కాపాడుకునేందుకు అన్ని రకాలైన చర్యలు తీసుకుంటున్నాం.నీరా పరిశ్రమ ఏర్పాటుపై అధ్యయనం చేస్తున్నాం. త్వరలోనే నీరాపై నిర్ణయం తీసుకుంటాం.ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపైనా ఉంది. బీసీలందరికీ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 13న మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కారాల ప్రదానోత్సవం

**అవనిగడ్డ:** తెలుగు జాతి రత్నం, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు పురస్కరించుకొని "మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కారాల ప్రదానోత్సవం-2025" ఏర్పాటు చేశారు. ఈ నెల 13వ తేదీ ఉదయం 11 గంటలకు తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని నాంపల్లిలో ఉన్న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఆధ్వర్యంలో యూనివర్సిటీలోని డాక్టర్ నందమూరి తారక రామా రావు కళా మందిరంలో ఈ సభ జరుగుతుంది. ఈ సభకు ముఖ్య అతిధిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం ఛాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ, సభాధ్యక్షులుగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య వెలుదండ నిత్యానందరావు, గౌరవ అతిధులుగా తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, ఏపీ అసెంబ్లీ పూర్వ ఉప సభాపతి, అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ విచ్చేయనున్నారు. మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కారాల గ్రహీతలుగా అమెరికా అజో-విభో కందాళం ఫౌండేషన్ అధ్యక్షుడు అప్పాజోస్యుల సత్యనారాయణ, 'సోలాపూర్ తెలుగుభాష అభివృద్ధి మండలి' అధ్యక్షులు కమటం మల్లికార్జున్ విచ్చేయనున్నారు.

**సంస్కృతి పురస్కారం విశిష్టత ..** తెలుగుజాతికి సదా స్మరణీయుడైన మహోన్నత నాయకుడు మండలి వెంకట కృష్ణారావు గారు. వారు అతి చిన్న వయసులోనే రాజకీయరంగంలో ప్రవేశించి పార్లమెంటు సభ్యులయ్యారు. ఆ తరువాత కాలంలో అవనిగడ్డ శాసనసభ్యులుగా ఎన్నికై మూడు పర్యాయాలు రాష్ట్ర మంత్రిగా తెలుగువారికి విశిష్ట సేవలందించారు. వీరు ప్రముఖ గాంధేయవాది. పేద, బడుగు వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేశారు. రాజకీయాలను సంఘ సేవగా మలుచుకొని విజయం సాధించారు. 1975 ఏప్రిల్లో హైదరాబాదులో వైభవంగా జరిగిన 'ప్రపంచ తెలుగు మహాసభ'ల కార్యనిర్వాహకుడుగా వ్యవహరించి తెలుగు వారి ఐక్యతను ప్రపంచానికి చాటారు. మహాసభల తీర్మానం మేరకు రాష్ట్రేతర ప్రాంతాల్లో, విదేశాల్లో నివసిస్తున్న తెలుగు వారి విద్యా సాంస్కృతిక అవసరాలు తీర్చడానికి, ఆయా ప్రాంతాల్లో తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణ, పరివ్యాప్తికి అంతర్జాతీయ తెలుగు సంస్థను స్థాపించి, వ్యవస్థాపక అధ్యక్షులుగా ప్రపంచంలోని తెలుగువారందరితో సంప్రదింపులు జరిపి, వారి బాగోగులు తెలుసుకొని వారందరినీ ఒకే వేదిక పై నిలిపి, తెలుగుజాతి వికాసానికి, తెలుగు భాషాసంస్కృతుల అభివృద్ధికి తన జీవితాన్ని ధారపోశారు. వారి స్మృత్యర్థం 2007లో అంతర్జాతీయ తెలుగు కేంద్రానికి మండలి వెంకట కృష్ణారావు గారి పేరు పెట్టడం జరిగింది. 2025 ఆగస్టు 4వ తేదీ ప్రారంభమైన వారి శతజయంతి వేడుకలు ఏడాదిపాటు జరుగుతున్నాయి. అటువంటి మహనీయుని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రేతర ప్రాంతాల్లో, విదేశాల్లో తెలుగు భాష, సంస్కృతుల పరిరక్షణ, పరివ్యాప్తికి విశేష కృషి సల్పిన వ్యక్తులకు / సంస్థలకు మండలి వెంకట కృష్ణారావు పేరిట ప్రతి సంవత్సరం 'సంస్కృతి పురస్కారా'న్ని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రదానం చేస్తోంది. ఈ పురస్కారానికి వారి తనయులు, ఆంధ్రప్రదేశ్ శాసనసభ తొలి ఉపసభాపతి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆర్థిక సౌజన్యం అందిస్తున్నారు.

**పురస్కార గ్రహీతల వివరాలు : అజో-విభో-కందాళం ఫౌండేషన్, అమెరికా**

32 ఏళ్ళ క్రితం తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల్లో విశేష కృషి చేసిన పండితులను పురస్కారాలతో, శాలువతో సత్కరించాలనే ఉద్దేశ్యంతో అప్పాజోస్యుల సత్యనారాయణ ఈ సంస్థను ప్రారంభించారు. 1994 నుంచి ప్రతిభామూర్తి జీవిత కాల సాధన' పేరిట పురస్కారం ఇవ్వటం ప్రారంభమైంది. ఈ అవార్డు క్రింద ఈ ఫౌండేషన్ లక్ష రూపాయల నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపికను ప్రదానం చేసి సత్కరిస్తోంది. 2003 నుంచి 'విశిష్టమూర్తి జీవితకాల సాధన' పురస్కారాన్ని ప్రారంభించారు. ఈ పురస్కారం క్రింద 50 వేల రూపాయల నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేస్తున్నారు. 2014 నుంచి భాషా-సాహితీ-పరిశోధనా రంగాలలో కృషి చేసిన ప్రముఖులకు 25 వేల రూపాయల నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపికతో సత్కరిస్తున్నారు. 2001 నుంచి 'రంగస్థలం సేవామూర్తి జీవితకాల సాధన' పురస్కారాన్ని 10 వేల రూపాయల నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపికతో ప్రదానం చేస్తున్నారు. ఇప్పటివరకు 22 పురస్కారాలను ప్రదానం చేశారు. అంతేకాక అజో-విభో-కందాళం ఫౌండేషన్ సాహిత్య విమర్శనా గ్రంథాలు, పద్యకృతులు, పరిశోధనా పుస్తకాలు 30 వరకు ప్రచురించి అపూర్వమైన సాహిత్య సేవలందిస్తోంది. అప్పాజోస్యుల సత్యనారాయణ గారు భారతదేశంలోనూ, విదేశాల్లోనూ తెలుగు నాటకాల్ని ప్రదర్శింపజేసి తెలుగు నాటక పరివ్యాప్తికి కృషి చేస్తున్నారు.

**తెలుగు భాషాభివృద్ధి మండలి, సోలాపూర్**

మహారాష్ట్రలోని సోలాపూర్లో 5 దశాబ్దాల క్రితం తెలుగు భాష, సాహిత్య, సంస్కృతుల పరిరక్షణ, పరివ్యాప్తే ధ్యేయంగా 'తెలుగు భాషాభివృద్ధి మండలి' ఏర్పాటైంది. గత 2 దశాబ్దాలుగా ప్రతి ఏటా వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తూ ఇప్పటి వరకు ఉచితంగా 2,000 మందికి తెలుగు బోధించారు. 2006లో తెలుగు భాషకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రాచీన భాష' హోదాను సాధించుకునే సందర్భంలో దేశవ్యాప్తంగా తెలుగు ప్రజల సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఈ సంస్థ 10 వేల మంది తెలుగు ప్రజల సంతకాలు సేకరించి, తెలుగు విశ్వవిద్యాలయానికి పంపి 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతినిచ్చా' అని ఎలుగెత్తి చాటింది. మల్లికార్జున్ సహజంగా నాటకరంగ కళాకారులు. దుర్యోధన ఏకపాత్రాభినయం ప్రేక్షకులను ముగ్ధులను చేస్తుంది. వీరు తెలుగు భాషాభివృద్ధి మండలి, సార్వజనిక్ గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.





# శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులు నగర ప్రజలకు ఎల్లప్పుడు ఉండాలి

## బోనాలు సమర్పించిన ఎంపీ కేశినేని శివనాథ్ సతీమణి

**విజయవాడ మేజర్ న్యూస్ :** శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులు విజయవాడ నగర ప్రజలపై ఎల్లప్పుడూ వుండాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి జానకి లక్ష్మీ అమ్మవారిని ప్రార్ధించినట్లు తెలిపారు. విజయవాడ సెంట్రల్ నియోజవర్గం చుట్టుగుంట ప్రాంతంలో ఆదివారం జరిగిన శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి 37వ బోనాల సంబరాల్లో కేశినేని జానకి లక్ష్మీ పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయానికి విచ్చేసిన కేశినేని జానకి లక్ష్మీకి 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కేశినేని జానకి లక్ష్మీ ఆలయంలో ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజాలు నిర్వహించారు. ఈ సందర్బంగా కేశినేని జానకి లక్ష్మీ మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి బోనాల సంబరాలుల్లో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందన్నారు.. రాబోయే రోజుల్లో విజయవాడ నగరం మరింతగా అభివృద్ధి చెందాలని, రాష్ట్ర ప్రజలు సుఖ, సంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని ప్రార్ధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 1వ, 26 డివిజన్ల క్లస్టర్ ఇన్ చార్జ్ వల్లభనేని సతీష్,డివిజన్ ప్రెసిడెంట్ తోట పాండు, సెక్రటరీ కారంపూడి సత్య, ఆలయకమిటీ సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మోసం చేయడంలో దిట్ట చంద్రబాబు





**కంచికచర్ల ఆగష్టు 10 మేజర్ న్యూస్ :** చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేయడంలో దిట్ట అని గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవెర్చకూండ ప్రజలను మరోసారి మోసం చేయడం జరిగిందని పట్టణ మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమా సురేష్ బాబు, అమర్ల పూడి యోహాన్ మాడుగుల మధు దుయ్యబట్టారు. కంచికచర్ల అంబేద్కర్ కాలనీ లో 6వ సెగ్మెంట్ పరిధిలోని 18,19,20 వార్డులలో ఆదివారం బాబు షూరిటి మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వేమా సురేష్ బాబు, అమర్లపూడి యోహన్ మాడుగుల మధు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి ఏడాది పైగా గడిచిన ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శిం చారు. పాలనా అంతా శిలాఫలకను, విగ్రహాలను ధ్వంసం చేయడమే పనిగా కొనసాగించారన్నారు, వైఎస్ జగన్ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు ఇస్తే కూటమి ప్రభుత్వం మాత్రం అరకొరగా పథకాలు ఇస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన పథకాలలో అరకొరగా ఇస్తు సూపర్ సిక్స్ ఇచ్చామని చెప్పుకోవడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో గ్రావెల్ ఇసుక, నల్లమటి, బెల్టుషాపులు, రేషన్ బియ్యం మీద దోచుకొవడమే పనిగా పాలనా చేస్తున్న కూటమి ప్రభుత్వం మోసాలపై ప్రజలకు వివరిస్తు వారు చేస్తున్న మోసాలను బహిర్గతం చేయాలని పిలుపునిచ్చారు. వారి మోసాలను ప్రజలు తెలుసుకొని వారికి సరైన గుణపాఠం చెబుతారని అన్నారు. అనం తరం వేమా సురేష్ బాబు, మాడుగుల మధు, గుగులోత్ శివనాయక్ లను బర్రె శంకర్రావు, చట్టి రవీంద్ర,అమర్లపూడి యోహన్ శాలువా కప్పి సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శి కాలువ పెద్ద బాబు, పట్టణ వైసిపి ఉపాధ్యక్షులు అమర్లపూడి యోహాన్, మాడుగుల మధు, అమర్ల పూడి వెంకట్రావు, క్రీస్తు రాజు, అమర్లపూడి వెంకటేశ్వరరావు, రత్తమ్మ బుజ్జి శీలం బుజ్జి, కళ్యాణి ద్వారకా,మేకల కోటేశ్వరరావు,మేకల బాబు,దేవిరెడ్డి లక్ష్మీనారాయణ, దేవిరెడ్డి శ్రీనివాసరావు 324, బడేటి మల్లీ, యర్రంశెట్టి బాలయ్య దేవరకొండ గురవయ్య, మాడుగుల ఆంజనేయులు, తుమ్మల గోపాల కృష్ణ రెడ్డి,పోన్నపల్లి శ్రీనివాసరావు,బండారుపల్లి శబరీ బొక్కిసం భూషణం, గుగులోత్ శివనాయక్, వేముల గోపి, ఆకుల రామారావు,, గొర్రెపాటి రాజు, అమర్లపూడి వెంకట్రావు,చట్టి రవీంద్ర,,చట్టి పద్మ బర్రె శంకర్రావు, శేషం అనిల్ గొర్రెపాటి బాబు,మంగినేని వెంకట్రామయ్య,,, కొనాల డూండీ, మంగినేని బుడ్డియ్య, మండల శివ, మురిమురి పాండురంగారావు,దాసరి రాంబాబు, బాణవత్ సురేష్,ఉప్పుతల వెంకయ్య, వేమా శివకొటి, శ్యామ్ ఉప్పుతల తిరపతిరాజు,, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆయుర్వేద వైద్యం ద్వారా అనేక దీర్ఘరోగాలను నయం చేసుకోవచ్చు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆయుర్వేదం అపర సంజీవని అని, సకల రోగ నివారిణి అని ఆయుర్వేద వైద్యం ద్వారా అనేక దీర్ఘ రోగాలను నయం చేసుకోవచ్చని టిడిపి సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ కొనకళ్ళ బుల్లయ్య అన్నారు.యోగ ప్రభ ఆయుర్వేద సూపర్ స్పెషాలిటీ వైద్యశాల వారి ఆధ్వర్యంలో స్థానిక 45వ డివిజన్లో సచివాలయం ప్రాంగణంలో, ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఆయుర్వేదంలో పంచకర్మ విధానాలు అనుసరించడం వల్ల అనేక దీర్ఘ రోగాలను నయం చేయవచ్చన్నారు. ప్రముఖ సీనియర్ ఆడిటర్, శేషాచార్యులు మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో 80% జనాభా ఆయుర్వేదాన్నే అనుసరిస్తున్నారన్నారు. 45వ డివిజన్ సచివాలయంలో యోగ ప్రభ ఆయుర్వేద వైద్యశాల సూపర్ స్పెషాలిటీ వైద్యులచే చక్కటి ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు చేయించి, ఉచితంగా మందులు పంపిణీ చేసి, ప్రజలకు అవగాహన కల్పించిన 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి, పి.వి. ఫణి కుమార్ వారి మిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. డాక్టర్ ముత్తేవి కృష్ణమాచార్యులు, డాక్టర్ ముత్తేవి రాజా రవి కిరణ్ లు చక్కటి ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించి, ప్రజలకు ఆయుర్వేద మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. గంజాల రవికుమార్, కొనకళ్ళ భాను ప్రసాద్, జి ప్రసాద్, 46వ డివిజన్ టిడిపి ఇంచార్జ్, గండికోట అంజి బాబు, 47వ డివిజన్ ఇన్చార్జ్ ఆళ్ల మాధవ, జి.పండరీనాథ్ తదితరులతో పాటుగా యోగప్రభ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



# నూతన వస్త్రబహుకరణ వేడుకలో సీఎం చంద్రబాబు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం పోరంకిలోని శ్రీ లక్ష్మీనరసింహ గార్డెన్స్ కళ్యాణ వేదికలో జరిగిన అడుసుమిల్లి వారి నూతన వస్త్రబహుకరణ వేడుకకు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు.రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, ఏలూరు రేంజ్ ఐజీ జివిజి అశోక్ కుమార్, జిల్లా ఎస్పీఆర్ గంగాధర రావు, పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడె ప్రసాద్, గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము, పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, ఉయ్యూరు ఆర్డీవో బీఎస్ హేలా షారోన్, ఇతర అధికారులు, కూటమి నాయకులు తదితరులు రాష్ట్ర ముఖ్యమంత్రికి ఘనంగా స్వాగతం పలికారు.

# బ్యాంకింగ్ ఓటీపీ మోసాలపై అప్రమత్తంగా ఉండండి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రోజు రోజుకి నూతన ఆలోచనతో వినూత్న పద్ధతులతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. వీటి పట్ల అప్రమత్తంగా లేకుంటే భారీ మొత్తంలో నగదు కోల్పోవాల్సి వస్తుందని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు,తెలియజేశారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన ఓటీపీ పిన్ నంబర్లు, పాస్వర్డ్ వంటి వ్యక్తిగత రహస్య వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దు. సైబర్ నేరగాళ్లు బ్యాంకు సిబ్బంది, లాటరీ సంస్థలు లేదా ఇతర మోసపూరిత వ్యక్తులుగా నటించి ఫోన్, మెసేజ్, ఈమెయిల్ ద్వారా ఈ వివరాలను అడగవచ్చు. బ్యాంకులు ఎప్పటికీ ఓటీపీని అడగవు. కాబట్టి ఇలాంటి కాల్స్, మెసేజెస్, ఈమెయిల్స్కి లోనుకాకండి. ఓటీపీ పంచుకోవడం వలన మీ బ్యాంకు ఖాతా నుండి డబ్బులు మాయమయ్యే అవకాశం ఉంటుంది.మోసం జరిగితే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్లైన్ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయండి. ప్రజలందరూ ఈ సందేశాన్ని గమనించి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్త వహించగలరు.

# యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ 52వ ఆవిర్భావ దినోత్సవం



**నాగయలంక ఆగస్టు 10 మేజర్ న్యూస్ :** నాగాయలంక గ్రామంలో అఈప్పారి వెంకటస్వామి, తుంగల కోటేశ్వరరావు యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్, భవనంలో 52 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనముగా జరిగింది. ఈ సందర్భంగా యు.టి.ఎఫ్ పతాకాన్ని బండ్రెడ్డి గోవర్ధన, గోపాల కృష్ణ జిల్లా కార్యదర్శి ఎగర వేసి యు.టి.ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ పరి స్థితులను, సంఘం, ఉపాధ్యా యులకు, చేసిన సేవలను, గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష ప్రధాన,కార్యదర్శులు, తెనాలి శ్రీను బాబు, బండ్రెడ్డి సాంబశివరావు, సబ్బినేని సురేష్ బాబు,బండ్రెడ్డి. శివ రామ కృష్ణ, మద్ది శ్రీనివాస రావు,రిటైర్ ఉపాధ్యాయులు, సబ్బినేని బాబు భవానివరప్రసాద్, రామకృష్ణ, ఎం.ల్లవెంకటేశ్వరరావు, రంగారావు, పాల్గొని అమరవీరులకు నివాళి అర్పించి యూనియన్, ప్రాచుర్యాన్ని, ప్రభావాన్ని వివరించారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, మైలవరం, విసన్నపేట, గంపలగూడెం మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకటట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999